క్లుప్తంగా

జతిన్‌దాస్ సంస్మరణ సభ కరపత్రాల ఆవిష్కరణ



సత్తెనపల్లి: బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన కామ్రేడ్ జతిన్‌దాస్ 95వ సంస్మరణ సభను దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) ఆధ్వర్యంలో ఈ నెల 13న స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరుగుతుందని పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ హాస్పిటల్ సెంటర్‌లో మంగళవారం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, కార్యదర్శి షేక్ దర్యావలి, పీకేఎం రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, సీఎల్సీ జిల్లా నాయకులు చికినం చిన్న పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన గంజి పేరయ్య కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువ సేన అండగా నిలిచింది. వైద్య చికిత్స కోసం విరాళాలు రూ.59,019లు సేకరించారు. యువ సేన రాష్ట్ర ప్రతినిధి గోలి వంశీకృష్ణ మంగళవారం మృతుడి కుమార్తె గౌతమి పేరుతో సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచి రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మిగిలిన నగదును మృతుడి భార్య భవానికి అందజేశారు. తమకు కష్టంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం తనిఖీ



రాజుపాలెం: వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందించాలని తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. 6 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు కార్యాలయం ఇన్‌చార్జి రాజేష్ వివరించారు. గోడౌన్‌లో సిలిండర్ల స్టాకు వివరాలను తహసీల్దారు తెలుసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన




రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లి ఎస్సీ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కరపత్రాలు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఇళ్లల్లో పాత టైర్లు, కొబ్బరి బోండాలను, కూలర్లలో నీటిని తొలగించాలని గ్రామస్తులకు వివరించారు. ఆరోగ్య సిబ్బంది సైడు కాల్వల్లో, మురుగు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పి.శ్రీకళ, జి.సరళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో ఫాగింగ్



పెదకూరపాడు: పెదకూరపాడులో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ గుడిపూడి రాజు పనులను పర్యవేక్షిస్తున్నారు. దోమల నివారణకు మంగళవారం ఫాగింగ్ నిర్వహించినట్లు ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. మురుగు కాల్వల్లో పూడిక తీత, పేరమ్మ వాగులో వ్యర్థాల తొలగింపు, వర్షపు నీరు నిల్వ లేకుండా లోతట్టు ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



సత్తెనపల్లి నందిగామలోని అచ్చమాంబ తల్లి దేవాలయంలో..



వెంకటాయపాలెంలో గణనాథుడికి పూజలు



సత్తెనపల్లి బ్రహ్మంగారి గుడి వీధిలో గణనాథుడు

వైభవంగా నిమజ్జనోత్సవాలు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. గణనాథుడి విగ్రహాలను నిమజ్జనానికి ఊరేగింపు భక్తులు తీసుకెళ్లారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వేలం పాటలో లడ్డూ ప్రసాదాలను భక్తులు పోటీపడి మరీ దక్కించుకున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు.

– బెల్లంకొండ



సత్తెనపల్లి పార్క్ వద్ద పూజలు అందుకున్న లంబోదరుడు



బెల్లంకొండలో నిమజ్జనానికి గణనాథుడి తరలింపు

మన గ్రోమోర్‌లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల స్టాకు తనిఖీ చేస్తున్న ఏఓ దేవదాసు

నకరికల్లు: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు సంతకాలతో కూడిన రసీదులు తప్పనిసరిగా అందజేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు స్పష్టం చేశారు. స్థానిక మన గ్రోమోర్ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల నిల్వలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల నుంచి నాలుగు నమూనాలు సేకరించి, నాణ్యతా ప్రమాణాల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ ఆర్ఎస్ఎం డి.శ్రీహరి నాగతేజ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చీమలమర్రి గ్రామంలోని ఈ పంట నమోదు ప్రక్రియను ఏఓ పరిశీలించారు. ఈ ఫార్మర్ కేవైసీ పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. వీఏఏ జి.జగదీష్, రైతులు శ్రీనివాసరావు, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.


అధిక దిగుబడి వచ్చే పంటల సాగు మేలు



సదస్సులో మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ హేమలత

సత్తెనపల్లి: రైతులు, కౌలు రైతులు పంట మార్పిడి విధానంపై అవగాహన పెంచుకుని, అధిక దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలని ఎంపీడీఓ జీవి సత్యనారాయణ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు మంగళవారం ప్రభుత్వ అధికారులతో ముఖాముఖి సదస్సు జరిగింది. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. రిసోర్స్ సెంటర్ మానిటరింగ్, రాష్ట్ర ట్రైనింగ్ మహిళా కో–ఆర్డినేటర్ ఎం.హేమలత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌పై అవగాహన చేసుకుని, నిధులు సాధించుకోవడానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్య పరుస్తున్నామన్నారు. దానికి అందరూ సహకరించాలని కోరారు. ఇన్‌చార్జ్ ఏడీఏ ఎస్.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు ప్రభుత్వం సీసీఆర్సీ ద్వారా బ్యాంకు రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతు సేవ కేంద్రాల ద్వారా ఇస్తోందని చెప్పారు. ఉద్యాన అధికారి నవీన్ మాట్లాడుతూ రైతులు బత్తాయి, జామ నారింజ, నిమ్మ తోటలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ ఏపీడీ పి.వెంకటనారాయణ, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, పశువైద్యాధికారి డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ దయాసాగర్, కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ, తోకల సాంబయ్య, కోటిరత్నం తదితరులువ పాల్గొన్నారు.

జీఓ నంబరు 85ను రద్దు చేయాలి



నల్లబ్యాడ్జీ ధరించిన డాక్టర్ కోటేశ్వరరావు

రాజుపాలెం: ఆంధ్రప్రదేశ్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణకుమార్ నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. మొక్కపాడులో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో ఆయనతో పాటు సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జీవో నంబరు 85ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీవో ద్వారా పీజీలో చదివే అవకాశాలు తమకు తగ్గడం వల్ల తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. 12వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని, 13న అత్యవసర కేసులు మాత్రమే చూస్తామని, 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

జీవో నంబరు 85తో వైద్యుల వృత్తి ప్రగతి అంధకారం

బెల్లంకొండ: వైద్యులకు వ్యతిరేఖంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబరు 85తో వైద్యుల వృత్తి ప్రగతి అంధకారంలో పడిందని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మంగళవారం చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ద్వారా తమ పీజీ విద్య అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేలు విరాళం



ఎమ్మెల్యే కన్నాకు నగదు చెక్కు అందిస్తున్న ఐక్య వేదిక నాయకులు

సత్తెనపల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలో వ్యాపార వర్గాల కూడళ్లలో తిరిగి వసూలు చేసిన రూ. 50 వేలు విరాళాలను ఆర్యవైశ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించేందుకు ముందుకు వచ్చారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు మంగళవారం నగదు చెక్కు అందజేశారు. ఆర్యవైశ్య సంఘాల ఐక్య వేదిక నాయకులు చౌట శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, మద్ది వెంకటేశ్వరరావు, దేవరపల్లి కాశీ, బాలనాగు శివ కోటేశ్వరరావు, కాకరపర్తి సుబ్రమణ్యం, అన్నం బాల సుబ్రమణ్యం, పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహార మసోత్సవాలు

క్రోసూరు: మండలంలోని గుడిపాడు, నాగవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. గుడిపాడులో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ మహాబూబ్‌బీ పాల్గొని, పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీని వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, పాల్గొన్నారు. నాగవరంలో ఏఎన్ఎం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు దీనకుమారి, ధనలక్ష్మి, సిరాజున్ బీ, ఆశ వర్కర్ అంజమ్మ పాల్గొన్నారు.

అన్న సంతర్పణ

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్న సంతర్పణ చేశారు. కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నికైంది. ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా కూరపాటి లక్ష్మీ నారాయణ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గేదెల దొంగల ముఠా?

సత్తెనపల్లి: గేదెలను అపహరించి విక్రయిస్తున్న నలుగురితో కూడిన ముఠాను సత్తెనపల్లి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో రెండు గేదెలను అపహరించి సత్తెనపల్లిలో విక్రయించేందుకు ఆటోలో తీసుకు రాగా ఆ ముఠాను సత్తెనపల్లి రూరల్ పోలీసులు దాడి చేసి, పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠాలో ఒక మహిళ, ముగ్గురు పురుషులు ఉన్నారు. వీరిని సత్తెనపల్లి రూరల్ పోలీసులు రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వరద బాధితులకు విరాళాల సేకరణ

పెదకూరపాడు: సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల పరిధిలోని 75 తాళ్లూరు, పరస గ్రామాల్లో మంగళవారం విజయవాడ వరద బాధితులకు సహాయార్థం విరాళాలు సేకరించారు. పెదకూరపాడులోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని వ్యాపారులు, ప్రజల నుంచి విరాళాలు సేకరించినట్లు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఒక్కరు సేవాభావంతో ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని కోరారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కవి దర్శి శేషారావుకు ప్రశంస

పెదకూరపాడు: అంతర్జాతీయ స్థాయిలో శ్రీశ్రీ కళా వేదిక తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే అంశంపై కవితా పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో పెదకూరపాడు గ్రామానికి చెందిన ప్రజా కవి, రచయిత దర్శి శేషారావు టాప్ టెన్‌లో నిలిచారు. సంస్థ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. దర్శి శేషారావును కళాభిమానులు అభినందించారు.

కల్వర్టు వద్ద తాత్కాలిక మరమ్మతులు



గ్రావెల్ తోలి పొక్లెయినర్‌తో చదును పనులు

సాక్షి ఎఫెక్ట్

క్రోసూరు: స్థానిక చెరువు కట్ట వద్ద మంత్రాలమ్మ గుడి దారిలో వర్షాలకు కల్వర్టు తూముల వద్ద యుద్ధప్రాతిపదికన పంచాయతీ అధికారులు మంగళవారం మట్టి తోలించారు. నిత్యం రైతులు రాకపోకలు సాగించే కల్వర్టు తూముల వద్ద ఇటీవల వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. దీనిపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారుల స్పందించారు. పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్‌నాయక్ క్షేత్రస్థాయిలో సందర్శించి, సమస్యను ఎంపీడీవో బి.మహేష్‌బాబుకు తెలియజేశారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు కల్వర్టుపై గ్రావెల్ తోలించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.

కేతవరం ఆలయ రహదారి నిర్మాణానికి సర్వే



అటవీ భూములలో సర్వే చేస్తున్న అటవీ, దేవాదాయ శాఖ అధికారులు

బెల్లంకొండ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కేతవరం శ్రీ వజ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రహదారి నిర్మాణం కోసం దేవదాయ, అటవీ శాఖ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరంలో ఉన్న ఆలయం మునిగిపోవంతో గత కొన్నేళ్ల క్రితం సమీపంలో ఉన్న కొండపై నూతన ఆలయాన్ని నిర్మించారు. కాగా అప్పట్లో ఆలయానికి వెళ్లేందుకు ఎమ్మాజీగూడెం గ్రామం నుంచి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. దాదాపుగా 14 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం గుండా ఈ రహదారి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదే విధంగా రహదారి పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉండడంతో రోడ్డు నిర్మాణ అనుమతులు కష్టతరంగా మారింది. దీంతో మన్నెసుల్తాన్ పాలెం నుంచి రహదారి నిర్మించేందుకు గతంలో అధికారులు ప్రతిపాదన చేశారు. ఈ గ్రామం నుంచి ఆలయానికి వెళ్లేందుకు నాలుగు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం, మరో ఆరు కిలోమీటర్ల మేర దేవాదాయ భూములు ఉన్నాయి. నూతన రహదారి నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉండడంతో అటవీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులు ప్రాథమిక సర్వే చేసినట్లు అటవీశాఖ డీఆర్వో ప్రకాశరావు తెలిపారు. అటవీ భూములను సాగు చేసుకునే రైతులు కూడా రహదారి నిర్మాణానికి అంగీకరించినట్లు తెలిపారు. త్వరలో ఉన్నతాధికారులు కూడా పరిశీలించిన అనంతరం రహదారి నిర్మాణంపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కాశిం, సాంబయ్య, వెంకటరావు, స్థానిక నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అంతర పంటల సేద్యంతో అధిక ఆదాయం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: కంది పైరులో అంతర పంటగా కూరగాయలు సాగు చేయడం వల్ల రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన బెల్లంకొండలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న కంది, బెండ, దోస, జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు పంటలు వేసే 45 రోజుల ముందుగా 30 రకాల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి భూమిలో చల్లాలని తెలిపారు. తద్వారా భూమికి సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెంది, ప్రధాన పంటకు కావలసిన పోషకాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎల్ పవన్ కుమార్, ఎంటీ అనంతలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఎం.సీతారామిరెడ్డి

ముప్పాళ్ళ: ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్ విద్యను పూర్తి చేయొచ్చని ఎంఈఓ ఎం.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. ముప్పాళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.నాగేంద్రమ్మ అధ్యక్షతన ఓపెన్ స్కూల్ విద్యా విధానంపై విద్యాశాఖ అనుబంధ శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎంఈఓ సీతారామిరెడ్డి మాట్లాడుతూ చదువుపై ఆసక్తి ఉండి, మధ్యలో బడి మానేసి చదువు కొనసాగించలేకపోయిన వారంతా వయో పరిమితి లేకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వ తేదీ వరకు, అపరాధ రుసుం రూ.500తో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ముప్పాళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో నార్నెపాడు పాఠశాల హెచ్ఎం వి.రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఆశ కార్యకర్తలు, స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల పరిశీలన



గుంటూరు బ్రాంచి కాలువ వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: చవితి విగ్రహాల నిమజ్జన ప్రాంతాలను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం పరిశీలించారు. సత్తెనపల్లి–నరసరావుపేట రోడ్డులోని గుంటూరు, పెదనందిపాడు బ్రాంచి కాల్వలు, దమ్మాలపాడు, రామకృష్ణాపురం సమీపంలోని కాల్వల వద్ద నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వినాయకుని విగ్రహంతో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఇవ్వాలని చెప్పారు. రాత్రిళ్లు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుద్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు, ఆర్ఐ కపిల్ దేవ్, విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, ఎన్సెస్పీ సిబ్బంది పాల్గొన్నారు.


జీవో నంబరు 115 ఉపసంహరణకు నిరసన



ఏరియా వైద్యశాల ఎదుట కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన

సత్తెనపల్లి: జీవో నంబరు 115ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పట్టణం లోని ఏరియా వైద్యశాల ఎదుట కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సిబ్బంది మంగళవారం విధులు బహిష్కరించి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోన కష్టకాలంలో పనిచేసిన తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2010 అనంతరం ఇంత వరకు రెగ్యులర్ నోటిఫికేషన్ లేదని, అయినా కాంట్రాక్ట్ పద్ధతిలోనే విధులు కొనసాగిస్తున్నామన్నారు. మూడున్నరేళ్ల నర్సింగ్ కోర్స్, 15 ఏళ్ల అనుభవం ఉన్న స్టాఫ్ నర్స్‌లను కాదని, ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయడం సరికాదన్నారు. ఆరు నెలల శిక్షణ మాత్రమే ఉన్న ఏఎన్ఎంల శాశ్వత నియామకాలు చేపట్టే విధంగా జీవో నంబరు 115ను తీసుకువచ్చారన్నారు. ప్ల కార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌లు పాల్గొన్నారు.

దుర్భాషలాడి, రెచ్చగొట్టి, దాడి చేసి..




గాయపడిన మేకల ప్రసాద్

బెల్లంకొండ: పార్టీ పేరుతో, కుటుంబ సభ్యులను దూషించవద్దని కోరినందుకు రెండు వర్గాల మధ్య దాడులకు దారితీసిన ఘటన చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ దాడిలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మేకల ప్రసాద్, ప్రభాకరరావు, రాజు అనే ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. టీడీపీకి చెందిన రామకృష్ణ, గుంజా శివ అనే ఇద్దరు గాయపడ్డారు. బాధితులు మేకల ప్రసాద్, ప్రభాకర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణ ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులను దుర్భాషలాడాడు. ఇది సరికాదని మరో వర్గం హితవు పలికింది. ఈ విషయం మనసులో పెట్టుకున్న టీడీపీ నాయకులు రాత్రి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. దీంతో మాటామాటా పెరిగి ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో వైఎస్సార్ సీపీకి చెందిన ముగ్గురికి, టీడీపీకి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజా గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను అక్కడ నుంచి చెదరగొట్టారు. గాయపడిన వారిని సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మేకల ప్రభాకర్‌రావు ఫిర్యాదు మేరకు ఆరుగురిపై, గుంజా శివ ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసులు పెట్టినట్లు చెప్పారు.



ప్రభాకరరావు



రాజు